
VEGA JEWELLERS
దివిలోనైనా... భువిలోనైనా.. వేగ తోడుంటే
వివాహం వైభోగం అవుతుంది.
ఆంధ్రప్రదేశ్ | తెలంగాణ | USA
follow us vegajewellers

కలం కౌంటర్
KALAM COUNTER TELUGU DAILY
తెలుగు దినపత్రిక
సంపుటి : 9 సంచిక : 294
పేజీలు : 4 వెల రూ.4/-
Circulated by : Krishna, Guntur, Prakasam, Nellore, West Godavari, Khammam, Hyderabad, Chittor
గురువారం 9 ఏప్రిల్ 2026

# రోడ్ల కనెక్టివిటీతో ఎకనామిక్ యాక్టివిటీ

● పోర్టు కారిడార్ అభివృద్ధికి సమగ్ర ప్రణాళికలు ● జాతీయ రహదారుల నిర్మాణంతోనే జాతి నిర్మాణం ● గోదావరి పుష్కరాల్లోపే రహదారుల నిర్మాణం... మరమ్మత్తులు ● ఈవీ బస్సుల వినియోగం పెంచి రవాణా వ్యయం తగ్గేలా చర్యలు ● రాష్ట్ర రహదారులు, జాతీయ రహదారుల ప్రాజెక్టులపై సమీక్షించిన ముఖ్యమంత్రి చంద్రబాబు

**అమరావతి,కలంకౌంటర్ :** రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల్లో ఆర్థిక కార్యకలాపాలకు ఊతమిచ్చేలా జాతీయ, రాష్ట్ర రహదారుల నిర్మాణం జరగాలని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు దిశానిర్దేశం చేశారు. జాతీయ రహదారులు రాష్ట్రంలోని పోర్టులతో పాటు దేశంలోని వివిధ ప్రాంతాలను కనెక్ట్ చేసేలా నిర్మాణం చేపట్టాలని సూచించారు. సచివాలయంలో బుధవారం రహదారులు భవనాలు, రవాణా, జాతీయ రహదారి ప్రాజెక్టులపై ముఖ్యమంత్రి సమీక్షించారు. రాష్ట్రంలో రోడ్ల నిర్వహణ, పాత్ హోల్ ఫ్రీ రహదారులు, ఈవీ బస్సుల వినియోగం, వివిధ రాష్ట్రాలను అనుసంధానించేలా జాతీయ రహదారి ప్రాజెక్టుల నిర్మాణంపై సమీక్షలో చర్చించారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి మాట్లాడుతూ..."రాష్ట్రంలో రహదారుల నిర్వహణ పటిష్టంగా ఉండాలి. మొత్తంగా 45,433 కిలోమీటర్ల మేర రోడ్లు ఉంటే... వాటిల్లో ఏటా 10,238 కిలోమీటర్ల మేర నిరంతర నిర్వహణ చేయాల్సి ఉంది. ప్రజలకు రోడ్ల వల్ల ఇబ్బంది లేకుండా చూడాలి. రోడ్ల నిర్వహణ అనేది నిరంతర ప్రక్రియగా చేపట్టాలి. ఎక్కడైనా రోడ్లకు గుంతలు పడితే... వాటినే వెంటనే సరిదిద్దితే ఇక ఇబ్బందులు ఉండవు. రోడ్ల నిర్వహణలో జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో ఎలాంటి పద్ధతులను అవలంబిస్తున్నారనే అంశాన్ని అధ్యయనం చేయాలి. ఆర్ అండ్ బీ రహదారుల మెయింటెనెన్స్ కోసం నిధుల



కొరత లేకుండా చూడాలి. వివిధ ప్రాంతాల్లో భౌగోళిక పరిస్థితులను అధ్యయనం చేసి దాని ఆధారంగా రహదారుల నిర్మాణం జరగాలి. రహదారి నిర్వహణకు ప్రామాణికతను నిర్దేశించాలి. స్థానికంగా భౌగోళిక పరిస్థితులు, వాతావరణం అంశాలను పరిగణనలోకి తీసుకుని రోడ్ల నిర్వహణలో చర్యలు చేపట్టాలి. ఉమ్మడి ఉభయ గోదావరి జిల్లాలు, బ్లాక్ కాటన్ సాయిల్ ఉన్న చోట హైబ్రీడ్ మోడల్ లో బీటీ లేదా వైట్ ట్యాప్ రోడ్ల నిర్మాణం చేపడితే బాగుంటుంది.



కాలువలు ఉన్న 570 కిలోమీటర్ల మేర రహదారులు పదే పదే ధ్వంసం అవుతున్నాయి. ఇలాంటి ప్రాంతాల్లో ఏ మెటీరియల్‌తో రోడ్ల నిర్మాణం జరిగితే బాగుంటుందనేది ఆలోచన చేయాలి. దీనిపై యూనివర్శిటీల్లో అధ్యయనం చేయిస్తే కొత్త ఆవిష్కరణలు వస్తాయి. గోదావరి పుష్కరాలను దృష్టిలో పెట్టుకుని గోదావరి, కృష్ణా, గుంటూరు జిల్లాల్లో రోడ్ల మరమ్మతులు చేపట్టండి. గోదావరి జిల్లాలు, కృష్ణా, గుంటూరు జిల్లాల్లో మొత్తంగా 471 గ్రామాల్లో రోడ్లను మరమ్మత్తులు చేపట్టాలి. గ్రేటర్ రాజమహేంద్రవరం పరిధిలో చేపట్టే రోడ్ల అభివృద్ధి అనేది అన్ని ప్రాంతాలకు రోల్ మోడల్‌గా నిలిచేలా పనులు చేపట్టాలి. పుష్కరాలకు ఉమ్మడి తూర్పు, పశ్చిమ గోదావరి జిల్లాలో రూ.400 కోట్లతో 531 కిలోమీటర్ల పొడవైన రహదారులను అభివృద్ధి చేయాలి. దీని కోసం సాస్కీ నిధులను వినియోగించుకోవాలి. కుంభమేళా తరహాలో పుష్కరాలకు నిధులు ఇవ్వాలని కోరుతూ కేంద్రానికి లేఖ రాయాలని' అని సీఎం సూచించారు.

**పోర్టుల అనుసంధానానికి ప్రాధాన్యత..** "రాష్ట్రంలోని పోర్టులను కనెక్ట్ చేసేలా జాతీయ రహదారుల నిర్మాణం చేపట్టాలి. ఆర్థిక లావాదేవీలకు కేంద్రంగా పోర్టులు ఉన్నాయి. పోర్టులను కనెక్ట్ చేసేలా పశ్చిమ భారతంలో గుజరాత్ మోడల్ అలానే ఉంది. తూర్పు భారతంలో తీర ప్రాంతం, పోర్టుల విషయంలో ఏపీ కీలకంగా ఉంది. ఈస్ట్-వెస్ట్ కారిడార్ గా జాతీయ రహదారుల నిర్మాణం జరగాలి. ఈ రకమైన కనెక్టివిటీని పెంచడం

- 2లో

## టీడీపీ కేంద్ర కార్యాలయంలో మంత్రి నారా లోకేష్ 87వ రోజు ప్రజాదర్బార్

-వినతులు స్వీకరించి, సమస్యల పరిష్కారానికి హామీ





**మంగళగిరి,కలంకౌంటర్ :** కష్టాల్లో ఉన్న వారికి నేనున్నానంటూ విద్య, ఐటీ శాఖల మంత్రి నారా లోకేష్ భరోసా ఇస్తున్నారు. మంగళగిరిలోని తెలుగుదేశం పార్టీ కేంద్ర కార్యాలయంలో 87వ రోజు ప్రజాదర్బార్ నిర్వహించారు. వివిధ సమస్యలపై పార్టీ కార్యాలయానికి తరలివచ్చిన సామాన్యులు, పార్టీ కార్యకర్తలను మంత్రి ఆప్యాయంగా పలకరించారు. వివిధ సమస్యలపై వారి నుంచి వినతులు స్వీకరించారు. సౌత్ కోస్ట్ రైల్వే ఏర్పాటు నేపథ్యంలో విజయవాడలోని లోకో పైలట్ల గాలా(సికింద్రాబాద్) డిపోను తరలించకుండా విజయవాడలోనే కొనసాగించేలా తగిన చర్యలు తీసుకోవాలని సిబ్బంది మంత్రి నారా లోకేష్ ను కలిసి విజ్ఞప్తి చేశారు. విజయవాడ బోర్డును కొండపల్లి నుంచి మోటమర్రికి పెంచడం వల్ల గత 17 ఏళ్లుగా విజయవాడలో ఉన్న సికింద్రాబాద్(గాలా) డిపో ఉనికి సందిగ్ధంలో పడిందని, డిపోను మోటమర్రికి లేగా డోర్నకల్ కు తరలిస్తారనే ప్రచారంతో సుమారు 500 కుటుంబాలు ఆందోళన చెందుతున్నాయనే విషయాన్ని మంత్రి దృష్టికి తీసుకువచ్చారు. ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయంలో గత 20 ఏళ్లుగా పనిచేస్తున్న దినసరి వేతన ఉద్యోగులను క్రమబద్ధీకరించాలని ఆల్ యూనివర్సిటీస్ ఎంప్లాయిస్ అండ్ వర్కర్స్ యూనియన్ దినసరి ఉద్యోగుల కమిటీ ప్రతినిధులు మంత్రి నారా లోకేష ను కలిసి కోరారు. కోవిడ్ వల్ల నష్టపోయిన హైర్ బస్ యజమానుల బస్సులకు రీప్లేస్ మెంట్ కల్పించి ఆదుకోవాలని ఏపీ హైర్ బస్ ఓనర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ప్రతినిధులు మంత్రి నారా లోకేష్ ను కలిసి విజ్ఞప్తి చేశారు. నంద్యాల జిల్లా మహానంది మండలం గాజులపల్లె గ్రామంలో తమకు వంశపారంపర్యంగా సంక్రమించిన 2.63 ఎకరాల భూమిని శిరిగిరి చంద్రమౌళీశ్వర రెడ్డి ఆక్రమించారని, విచారించి తగిన న్యాయం చేయాలని కర్నూలు జిల్లా గుండంపాడుకు చెందిన ఎస్.చిన్న శివమ్మ మంత్రి నారా లోకేష్ ను కలిసి కోరారు. ఆయా వినతులను పరిశీలించి సమస్యల పరిష్కారానికి కృషిచేస్తామని మంత్రి హామీ ఇచ్చారు.

## సేంద్రియ వ్యవసాయమే భవిష్యత్


● రసాయనాల తగ్గింపు, ఆరోగ్యకరమైన భూమి, జీవన విధానం ముఖ్యం ● డిమాండ్ ఆధారిత పంటల సాగుపై రైతులు ఆలోచనాత్మకంగా ముందుకు సాగాలి ● మారుతున్న ఆహారపు అలవాట్లకు అనుగుణంగా పంటల మార్పు అవసరం ● సాగునీటి సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉంది ● మారుటేరు కిసాన్ మేళాలో వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు

**పశ్చిమగోదావరి జిల్లా/మారుటేరు,కలంకౌంటర్ :** రాష్ట్రంలో వ్యవసాయ రంగాన్ని స్థిరమైన అభివృద్ధి దిశగా తీసుకెళ్లడం కోసం కూటమి ప్రభుత్వం కట్టుబడి ఉందని వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు పేర్కొన్నారు. ఆచంట నియోజకవర్గంలోని, పెనుమంట్ర మండలం మారుటేరు వ్యవసాయ పరిశోధన కేంద్రంలో బుధవారం నిర్వహించిన "కిసాన్ మేళా" మారుతున్న వాతావరణ పరిస్థితులు -- సుస్థిర వరి వ్యవసాయం" కార్యక్రమంలో మంత్రి ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. తొలుత పరిశోధన కేంద్రంలోని ల్యాబ్ లను పరిశీలించి శాస్త్రవేత్తలతో మాట్లాడి ఆధునిక వరి వంగడాల వివరాలు అడిగి తెలుసుకున్నారు.



అనంతరం అక్కడ ఏర్పాటు చేసిన ఎన్ జీ రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం, ప్రైవేట్ కంపెనీలు ఏర్పాటు చేసని ప్రత్యేక స్టాల్స్ ని పరిశీలించి, వ్యవసాయ రంగంలో ఉపయోగించే ఆధునిక యంత్రాలను స్వయంగా డ్రైవ్ చేశారు. ఈ సందర్భంగా రైతులను ఉద్దేశించి సభలో మాట్లాడుతూ సేంద్రియ వ్యవసాయం ద్వారా రైతులకు తక్కువ వ్యయంతో ఎక్కువ లాభాలు సాధ్యమవుతాయని, అదే సమయంలో భూమి సారాన్ని కాపాడుతూ ప్రజలకు ఆరోగ్యకరమైన ఆహారం అందించవచ్చని ఆయన తెలిపారు. ప్రస్తుతం రసాయన ఎరువులు, పురుగుమందుల అధిక వినియోగం వల్ల భూమి నాణ్యత దెబ్బతింటోందని, రైతుల ఖర్చులు పెరుగుతున్నాయని మంత్రి ఆందోళన వ్యక్తం చేశారు. ఈ పరిస్థితిని మార్చడానికి సేంద్రియ వ్యవసాయాన్ని ప్రోత్సహించడం అత్యవసరమని చెప్పారు. రాష్ట్ర ప్రభుత్వం రైతులకు సేంద్రియ వ్యవసాయం వైపు మారేందుకు శిక్షణ, సబ్సిడీలు, మార్కెటింగ్ సదుపాయాలు అందిస్తున్న దని ఆయన వివరించారు. రైతులు ఉత్పత్తి చేసిన సేంద్రియ పంటలకు మంచి ధర లభించేలా ప్రత్యేక మార్కెట్లు ఏర్పాటు చేయడం జరుగుతోందన్నారు. భవిష్యత్ తరాలకు ఆరోగ్యకరమైన పర్యావరణం అందించాలంటే సేంద్రియ వ్యవసాయాన్ని ప్రతి రైతు ఆచరించాల్సిన అవసరం ఉందని మంత్రి పిలుపునిచ్చారు. రైతుల సంక్షేమం, ప్రజల ఆరోగ్యం దృష్ట్యా సేంద్రియ వ్యవసాయాన్ని విస్తృతంగా ప్రోత్సహించడానికి ప్రభుత్వం అన్ని చర్యలు తీసుకుంటుందని ఆయన స్పష్టం చేశారు. మార్టేరు వ్యవసాయ

## వినతులు స్వీకరించిన పవన్ కళ్యాణ్





**విశాఖపట్నం,కలంకౌంటర్ :** ఆంధ్ర విశ్వ విద్యాలయంలో నిర్వహిస్తున్న మెగా కల్చరల్ ఫెస్ట్ లో పాల్గొనేందుకు విశాఖ విమానాశ్రయానికి చేరుకున్న ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ . ఆయనకు జనసేన నేతలు ఘన స్వాగతం పలికారు. అక్కడ ప్రజల నుంచి వినతులు స్వీకరించి, వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు

## మామునూరు ఎయిర్‌పోర్టుకు 3 నెలల్లో శంకుస్థాపన

**న్యూఢిల్లీ,కలంకౌంటర్ :** ఎయిర్‌పోర్టులపై అన్ని డిమాండ్లను పరిశీలిస్తున్నామని పౌరవిమానయాన శాఖ మంత్రి రామ్మోహన్ నాయుడు తెలిపారు. ఫీజబులిటి ఉన్న చోట వీటి నిర్మాణానికి సిద్ధంగా ఉన్నామన్నారు. ఢిల్లీలో నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. "తెలంగాణలోని మామునూరు ఎయిర్‌పోర్టుకు 3 నెలల్లో శంకుస్థాపనకు ఏర్పాట్లు చేస్తున్నాం. ఆదిలాబాద్, కొత్తగూడెం ఎయిర్‌పోర్టు ప్రతిపాదనలనూ పరిశీలిస్తున్నాం. ఆదిలాబాద్‌లో పెద్ద విమానాశ్రయం నిర్మించాలని కేంద్రం భావిస్తోంది. సైనిక, పౌరుల అవసరాలకు అనుగుణంగా ఇది ఉంటుంది" అని తెలిపారు.



## రాష్ట్రానికి రాజధాని లేకుండా చేయడమే చంద్రబాబు లక్ష్యం: జగన్

- 2లో



## యువత పారిశ్రామిక వేత్తలుగా ఎదగాలి...


-రాష్ట్ర బీసీ సంక్షేమ శాఖ మంత్రి సవిత

- 2లో



## వినతులు స్వీకరించిన హోంమంత్రి వంగలపూడి అనిత

-బాధితులకు తక్షణ పరిష్కారం చూపిన అనిత



**మంగళగిరి,కలంకౌంటర్ :** ప్రజల సమస్యలను ప్రత్యక్షంగా తెలుసుకుని, వాటికి సత్వర పరిష్కారం చూపడమే లక్ష్యంగా రాష్ట్ర హోంమంత్రి వంగలపూడి అనిత మంగళగిరిలోని టీడీపీ కేంద్ర కార్యాలయంలో నిర్వహించిన 'గ్రీవెన్స్ సెల్' కార్యక్రమంలో పాల్గొన్నారు. రాష్ట్రవ్యాప్తంగా వివిధ ప్రాంతాల నుండి తరలివచ్చిన ప్రజల నుండి ఆమె వినతులను స్వీకరించారు.



సమస్యల తీవ్రతను బట్టి హోంమంత్రి అక్కడికక్కడే స్పందించారు. సుదూర ప్రాంతాల నుండి వచ్చిన బాధితుల సమస్యలపై సంబంధిత జిల్లా ఎస్పీలు, కలెక్టర్లు, ఉన్నతాధికారులతో ఫోన్ ద్వారా మాట్లాడి, బాధితులకు న్యాయం చేయాలని ఆదేశించారు. పోలీస్ యంత్రాంగం ప్రజలకు జవాబుదారీగా ఉండాలని, బాధితులు మళ్లీ మళ్లీ కార్యాలయాల చుట్టూ తిరగకుండా చూడాలని స్పష్టం చేశారు. గత ప్రభుత్వ హయాంలో అక్రమ కేసులు, వేధింపులకు గురైన బాధితులు తమ గోడును వెళ్లబోసుకున్నారు. పలువురు సామాన్యులు తమ భూములను కబ్జా చేశారని, పోలీసుల సహాయం అందడం లేదని మొరపెట్టుకున్నారు. మహిళలపై జరుగుతున్న అక్రమాలు, వేధింపులపై ఫిర్యాదులు రాగా.. మహిళా భద్రత విషయంలో రాజీ పడే ప్రసక్తే లేదని మంత్రి హామీ ఇచ్చారు.

# వేమూరు నియోజకవర్గంలో ముఖ్యమంత్రి చంద్రబాబు పర్యటన

● 'మీ భూమి-మీ హక్కు'లో భాగంగా రైతులకు పట్టాదారు పుస్తకాలు అందించనున్న సీఎం ● ఇప్పటి వరకూ 22.79 లక్షల పట్టాదారు పుస్తకాలు రైతులకు అందజేత



**అమరావతి,కలంకౌంటర్ :** ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు గురువారం బాపట్ల జిల్లా, వేమూరు నియోజకవర్గంలో పర్యటించనున్నారు. 'మీ భూమి-మీ హక్కు' కార్యక్రమంలో పాల్గొని రైతులకు పట్టాదారు పాసు పుస్తకాలను అందిస్తారు. గత ప్రభుత్వం నిర్వహించిన రీ సర్వే తప్పుల తడకగా ఉండటంతో కూటమి ప్రభుత్వం ఆ తప్పులను సరి చేస్తోంది. గత ముఖ్యమంత్రి పొలం హద్దుల కోసం పాతే రాళ్లపైనా, రైతులకు ఇచ్చే పట్టాదారుపుస్తకాలపై తన ఫోటోలను ముద్రించుకున్నారు. వీటన్నింటినీ కూటమి ప్రభుత్వం ప్రక్షాళన చేస్తోంది. రాష్ట్ర వ్యాప్తంగా మొత్తం 16,816 గ్రామాల్లో రీ సర్వే చేయాల్సి ఉండగా, ఇప్పటికే 6,976 గ్రామాల్లో సర్వే పూర్తైంది. ఈ ఏడాది చివరి నాటికి రీ సర్వే పూర్తి చేయాలని ప్రభుత్వం లక్ష్యం విధించుకుంది. దీంతో పాటు ఈ ఏడాది ప్రారంభం నుంచి ప్రభుత్వం రైతులకు పట్టాదారు పాస్ పుస్తకాలను రాజముద్రతో అందిస్తోంది. జనవరి నెలలో 4,783 గ్రామాల్లో 18.77 లక్షల పాస్ పుస్తకాలు, ఫిబ్రవరిలో 279 గ్రామాల్లో 1,16,129 పాస్ పుస్తకాలు, మార్చిలో 299 గ్రామాల్లో 1,29,298 పట్టాదారు పాస్ పుస్తకాలను ప్రభుత్వం అందించింది. జనవరి నుంచి 5,717 గ్రామాల్లో 22.79 లక్షల పట్టాదార్ పాస్ పుస్తకాలను రైతులకు ప్రభుత్వం అందించింది. మార్చి 2027 నాటికి 7,518 సిగ్నల్ గ్రామాల్లో 47,02,000 పాస్ పుస్తకాలు, ఏప్రిల్ 2027 కల్లా 2,438 నాన్ సిగ్నల్ గ్రామాల్లోని 15,02,000 పాస్ పుస్తకాలు పంపిణీ చేసేందుకు ప్రభుత్వం సిద్ధమైంది. మొత్తంగా 9,956 గ్రామాల్లో 62,04,000 పాస్‌బుక్స్ కొత్తవి ఇవ్వాల్సి ఉంది. బాపట్ల జిల్లాలోని 8 మండలాల్లో 3,658 పాస్ పుస్తకాలు, అలాగే వేమూరు అసెంబ్లీ నియోజకవర్గంలోని 1,795 పాస్ పుస్తకాలను గురువారం పంపిణీ చేయనున్నారు. అంతేకాదు... రైతులకు తెలియకుండా భూ రికార్డులు మార్పిడి చేయలేని విధంగా ప్రభుత్వం చర్యలు చేపట్టింది. బ్లాక్ చైన్ టెక్నాలజీనీ అమల్లోకి తెస్తోంది. ఈ విధానం ద్వారా రికార్డులు ట్యాంపర్ చేయాలన్నా, తారుమారు చేయాలన్నా అసాధ్యం.

**ముఖ్యమంత్రి పర్యటన వివరాలు..** ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు వేమూరు నియోజకవర్గంలో పర్యటనలో భాగంగా... ఉదయం 10.50 గంటలకు భట్టిప్రోలు మండలం, సూరేపల్లికి చేరుకుంటారు. 11.00 గంటలకు సూరేపల్లిలో నిర్వహించే ప్రజావేదిక సభలో పాల్గొని ప్రసంగిస్తారు. మధ్యాహ్నం 01.35 గంటలకు వ్యవసాయ క్షేత్రాన్ని పరిశీలించి రైతులతో మాట్లాడతారు. 02.10 గంటలకు టీడీపీ శ్రేణులతో సమీక్షా సమావేశం నిర్వహిస్తారు. అనంతరం సాయంత్రం 04.05 గంటలకు అమరావతి చేరుకుంటారు.

# సిబ్బంది సమిష్టి కృషితో విద్యుత్ శాఖకు మంచి పేరు వచ్చింది

● కొత్త సబ్‌స్టేషన్ల నిర్మాణం వేగంగా కొనసాగుతుంది ● రైతులకు ఇబ్బందులు లేకుండా విద్యుత్ అందించే లక్ష్యంతో పనిచేస్తున్నాం ● విద్యుత్ బిల్లులు పెంచకుండా, అంతరాయం లేని సరఫరాపై దృష్టి ● విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్






**విజయవాడ, కలంకౌంటర్ :** ప్రజలకు నాణ్యమైన, అంతరాయం లేని విద్యుత్ అందించడమేకాకుండా ప్రజలకు మరింత మెరుగైన సేవలు అందించడమే ప్రభుత్వ లక్ష్యమని విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ పేర్కొన్నారు. గుణదల విద్యుత్ సౌధలో ఆంధ్రప్రదేశ్ సెంట్రల్ పవర్ డిస్ట్రిబ్యూషన్ కార్పొరేషన్ లిమిటెడ్ నూతన కార్యాలయానికి విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్, ఎంపీ కేసినేని శివనాథ్, ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్, ఎనర్జీ స్పెషల్ చీఫ్ సెక్రెటరీ కె. విజయానంద్, సీఎండీ పి. పుల్లా రెడ్డి ల సమక్షంలో ప్రారంభోత్సవం చేశారు. ఈ సందర్భంగా మంత్రి గొట్టిపాటి రవికుమార్ మాట్లాడుతూ.. ఏపీసీపీడీసీఎల్ (ఆంధ్రప్రదేశ్ సెంట్రల్ పవర్ డిస్ట్రిబ్యూషన్ కార్పొరేషన్ లిమిటెడ్) నూతన కార్యాలయం ప్రారంభించడం చాలా ఆనందంగా ఉందని తెలిపారు. సిబ్బంది సమిష్టి కృషితో విద్యుత్ శాఖకు మంచి పేరు వచ్చిందన్నారు. సుమారు 35 నుండి 40 కోట్ల రూపాయల వ్యయంతో, 65 వేల చదరపు అడుగుల విస్తీర్ణంలో అత్యాధునిక కార్పొరేట్ కార్యాలయాన్ని నిర్మించుకున్నామ న్నారు. రాష్ట్రవ్యాప్తంగా కొత్త సబ్‌స్టేషన్ల నిర్మాణం వేగంగా జరుగుతోందన్నారు. ప్రభుత్వ లక్ష్యాలు, ఆదేశాలు అనుగుణంగా పనిచేస్తూ.. ముఖ్యంగా ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఆదేశాల ప్రకారం విద్యుత్ ఛార్జీలు పెంచకుండా, నాణ్యమైన విద్యుత్తును నిరంతరం అందించాలనే లక్ష్యంతో పనిచేస్తున్నామన్నారు. ఎట్టి పరిస్థితుల్లోనూ పవర్ డిస్టర్బెన్స్ (విద్యుత్ అంతరాయం) ఉండకూడదని, లో-వోల్టేజ్ సమస్యలు తలెత్తకుండా చూడాలని ముఖ్యమంత్రి ఆదేశించారని అందుకు అనుగుణంగా సిబ్బంది పనిచేస్తున్నారన్నారు. వినియోగదారులలో విద్యుత్ శాఖ పట్ల ఉన్న సానుకూల దృక్పథాన్ని (Positive Perception) ప్రస్తుతం ఉన్న 80% నుండి 95% పైకి తీసుకెళ్లడమే మా లక్ష్యంతో పనిచేస్తున్నామన్నారు. రైతులకు పగటిపూట విద్యుత్ పీఎం కుసుమ పథకం కింద కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు రైతులకు పగటిపూట ఉచిత విద్యుత్ అందించడం కోసం చేపట్టిన టెండర్లు పూర్తయ్యాయని, త్వరలోనే ఈ పనులు ప్రారంభమవుతాయన్నారు. రికార్డు స్థాయి విద్యుత్ ఉత్పత్తి, ఆధునిక పద్ధతులు ఉపయోగించి, చరిత్రలో ఎన్నడూ లేని విధంగా రికార్డు స్థాయిలో విద్యుత్ ఉత్పత్తిని సాధించామన్నారు. పగటిపూట విద్యుత్ డిమాండ్ తక్కువగా ఉన్నప్పుడు కొనుగోలు చేస్తూ, సాయంత్రం పీక్ అవర్స్‌లో మనమే స్వయంగా జనరేట్ చేసుకుంటూ విద్యుత్ లోటు లేకుండా చూస్తున్నామన్నారు. సోలార్, విండ్ (గాలి మర్లు), మరియు పంప్డ్ స్టోరేజ్ ప్రాజెక్టుల (ఫ్లూ) ద్వారా విద్యుత్ ఉత్పత్తిని పెంచుతున్నామన్నారు. బ్యాటరీ స్టోరేజ్ కోసం ఇప్పటికే 10 చోట్ల టెండర్లు పిలవడం జరిగిందన్నారు. విపత్తు సమయాల్లో విద్యుత్ సిబ్బంది తమ సేవలు నిరంతరాయంగా అందిస్తున్నారన్నారు. గతంలో వరదలు వచ్చినప్పుడు ముఖ్యంగా విశాఖపట్నంలో తుపాను వచ్చినప్పుడు విద్యుత్ శాఖ సిబ్బంది రేయింబవళ్లు కష్టపడి పనిచేశారన్నారు. దాదాపు 1500 నుండి 2000 మంది సిబ్బంది తమ కుటుంబాలను వదిలి, కేవలం 24 గంటల్లోనే సుమారు 20 వేల విద్యుత్ స్తంభాలను పునరుద్ధరించి, విద్యుత్ సరఫరాను పునరుద్ధరించారన్నారు. రాష్ట్రంలో నాణ్యమైన విద్యుత్ సరఫరా అందిస్తున్నామని పేర్కొన్నారు. రాష్ట్ర ప్రజలకు నాణ్యమైన విద్యుత్ అందించడంలో ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. ప్రజలకు మరింత మెరుగైన సేవలు అందించాలని సిబ్బందిని కోరారు. పగలు, రాత్రి తేడా లేకుండా పనిచేసే శాఖగా విద్యుత్ శాఖను మంత్రి రవికుమార్ పేర్కొన్నారు.. ఎనర్జీ సెక్రటరీ విజయానంద్ మాట్లాడుతూ... విద్యుత్ కొనుగోలు, అమ్మకాల్లో పారదర్శకత కోసం మానవ ప్రమేయం లేని అత్యాధునిక సాఫ్ట్‌వేర్‌ను ఉపయోగిస్తున్నామన్నారు. ఈ ఏడాది రికార్డు స్థాయిలో 14,009 మెగావాట్ల విద్యుత్ గరిష్ట లోడ్ ను విజయవంతంగా నిర్వహించామన్నారు. ఈ వేసవిలో విద్యుత్ కు ఎటువంటి అంతరాయం లేకుండా 275 మిలియన్ యూనిట్ల విద్యుత్‌ను సరఫరా చేశామన్నారు. ఏపీ జెన్కో (AP GENCO) ప్లాంట్ల సామర్థ్యాన్ని 85-90% కి పెంచామన్నారు. ఏపీసీపీడీసీఎల్ భవనాన్ని 'నెట్ జీరో' (చీప్గ వతీశీ) కాన్సెప్ట్ తోపాటు సోలార్ ఎనర్జీ, గ్రీన్ టెక్నాలజీని ఉపయోగించడం ద్వారా విద్యుత్ ఖర్చు తగ్గించడమే కాకుండా కార్బన్ న్యూట్రాలిటీని సాధించాలనే లక్ష్యంగా పెట్టుకుని నిర్మించామన్నారు. సీఎండి పుల్లారెడ్డి గారు మాట్లాడుతూ.. డిస్కం అధికారులు అందరూ వినియోగదారులకు మరింత మెరుగైన సేవలు అందించాలని కోరారు. కార్యక్రమం లో టెక్నికల్ డైరెక్టరు మురళీ కృష్ణ యాదవ్, ప్రాజెక్ట్స్ డైరెక్టర్ టీ వీ ఎస్ ఎన్ మూర్తి, ఫైనాన్స్ డైరెక్టర్ వెంకటేశ్వర్లు, సి. జి.ఎమ్ లు, జిఎమ్ లు పాల్గొన్నారు.

# నిబంధనల మేరకు దుకాణాలు నిర్వహించాలి

● ఆహార పదార్థాల్లో నాణ్యత, శుభ్రత పాటించాలి. ● పారదర్శకంగా దుకాణాలు కేటాయింపు. ● కమిషనర్ ఎన్.మౌర్య.





**తిరుపతి,కలంకౌంటర్ :** ఈట్ స్ట్రీట్ లో దుకాణాలు పొందిన వారు ప్రభుత్వ నియమ నిబంధనలు అనుసరించి వ్యాపారాలు నిర్వహించుకోవాలని నగరపాలక సంస్థ కమిషనర్ ఎన్.మౌర్య దుకాణదారులకు సూచించారు. భారత ప్రభుత్వ నిధులతో ఏర్పాటు చేసిన ఈట్ స్ట్రీట్ లోని 14దుకాణాలకు బుధవారం కచ్చపి ఆడిటోరియంలో లక్కీ డ్రా నిర్వహించారు. కమిషనర్ ఎన్.మౌర్య స్వయంగా పాల్గొని లక్కీ డ్రా నిర్వహించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ నగరపాలక సంస్థ కార్యాలయం ఎదురుగా ఏర్పాటు చేసిన 14దుకాణాలకు పారదర్శకంగా లక్కీ డ్రా నిర్వహించామని తెలిపారు. ఇందులో 13దుకాణాలు లాటరీ ద్వారా అభ్యర్థులకు కేటాయించగా, 10వ నెంబర్ దుకాణం ఐ స్టోన్ కంపెనీకి నేరుగా కేటాయించామని తెలిపారు. దుకాణదారులు ఖచ్చితంగా ఫుడ్ సేఫ్టీ అండ్ స్టాండర్డ్స్ అథారిటీ ఆఫ్ ఇండియా వారి సూచనల మేరకు ఆహార పదార్థాలు వినియోగించాలని తెలిపారు. దుకాణ దారులు నాణ్యమైన ఆహారాన్ని ప్రజలకు అందించాలని తెలిపారు. నిల్వ ఉంచిన ఆహార పదార్థాలను వినియోగించరాదని, అధిక ధరలకు విక్రయించరాదని తెలిపారు. ఆరోగ్యంతో ఉన్న వారి చేతనే ఆహారం వండించడం, వడ్డించేలా చూడాలని తెలిపారు. ఆహార పదార్థాలతో పాటు, పరిసరా లను పరిశుభ్రంగా ఉంచుకోవాలని తెలిపారు. తడి, పొడి చెత్త బుట్టలను వినియోగించాలని తెలిపారు. ప్లాస్టిక్ కవర్లు, సింగిల్ యూజ్ ప్లాస్టిక్ ను వినియోగించరాదని తెలిపారు. నిబంధనలు అతిక్రమించిన వారిపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఆహార నాణ్యత ప్రమాణాలపై ఫుడ్ సేఫ్టీ అధికారులచే ప్రెసెంటేషన్ ఇచ్చారు. ఈ కార్యక్రమం లో డిప్యూటీ కమిషనర్ అమరయ్య, రెవిన్యూ అధికారులు సేతు మాధవ్, రవి, హెల్త్ ఆఫీసర్ డాక్టర్ యువ అన్వేష్, ఫుడ్ సేఫ్టీ అధికారులు వెంకటేశ్వర్ రావు, జగదీష్, నగరపాలక సంస్థ సిబ్బంది పాల్గొన్నారు.

# కష్టపడిన వారిని గుర్తించాలనేది తెలుగుదేశం పార్టీ సిద్ధాంతం

● మీ పనితీరే ఇక్కడి వరకు రావడానికి కారణం ● పార్టీ పిలుపునిచ్చిన కార్యక్రమాలను సక్రమంగా నిర్వహిస్తే పార్టీ వందేళ్లు ఉంటుంది ● 'మై టీడీపీ యాప్' టాప్ 10 ఫెర్ఫార్మర్స్ తో మంత్రి లోకేష్ ఆత్మీయ భేటీ ● పార్టీ సిద్ధాంతాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని దిశానిర్దేశం ● యాప్ సమర్థ వినియోగం పట్ల ఉత్తమ కార్యకర్తలకు ఘనంగా సత్కారం





**మంగళగిరి,కలంకౌంటర్ :** కష్టపడిన వారిని గుర్తించాలనేది పార్టీ సిద్ధాంతం అని టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి, విద్య, ఐటీ శాఖల మంత్రి నారా లోకేష్ అన్నారు. రాష్ట్రవ్యాప్తంగా 'మై టీడీపీ యాప్' సమర్థ వినియోగం, పార్టీ పిలుపునిచ్చిన కార్యక్రమాల్లో ఉత్సాహంగా పాల్గొంటున్న టాప్ 10 ఫెర్ఫార్మర్స్ తో మంగళగిరిలోని టీడీపీ కేంద్ర కార్యాలయంలో మంత్రి నారా లోకేష్ ఆత్మీయ భేటీ అయ్యారు. ఈ సందర్భంగా ప్రతిఒక్కరినీ ఆప్యాయంగా పలకరించి వారి కష్టసుఖాలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం మంత్రి మాట్లాడుతూ.. తెలుగుదేశం పార్టీ అనేది ఒక వ్యవస్థ. మనం అందరం ఆ వ్యవస్థలో భాగం. మీ పనితీరు వల్లే ఇక్కడ వరకు రాగలిగారు. రేపు పార్టీ అధినేత చంద్రబాబునాయుడు గారి పక్కన కూర్చొంటారు. పార్టీ పిలుపునిచ్చిన కార్యక్రమాలను సక్రమంగా నిర్వహిస్తే పార్టీ వందేళ్లు ఉంటుం ది. వ్యక్తుల కంటే పార్టీ ముఖ్యమని గుర్తించాలి. పార్టీలో సంస్కరణల కోసం నేను పోరాడుతున్నా. కార్యకర్తే అధినేత. గ్రామ పార్టీ అధ్యక్షుడు, క్లస్టర్ ఇంఛార్జ్ పొలిట్ బ్యూరో వరకు రాగలగాలి.

**ఎన్నికల్లో విజయం సాధించాలంటే పార్టీ సిద్ధాంతాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలి..** ఎన్నికల్లో విజయం సాధించాలంటే పార్టీ సిద్ధాంతాలను బలంగా ప్రజల్లోకి తీసుకెళ్లాలని ఈ సందర్భంగా మంత్రి లోకేష్ దిశానిర్దేశం చేశారు. మనం కోరుకున్న మార్పు సాధ్యం కావాలంటే అందరం కలిసికట్టుగా పనిచేయాలి. పార్టీ భవిష్యత్ దృష్ట్యా కడప మహానాడులో తీర్మానించిన 6 శాసనాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలి. పార్టీ సిద్ధాంతాలను వివరించేందుకు 365 రోజులూ శిక్షణ తరగతులు నిర్వహిస్తాం. 2019-24 మధ్య జగన్ రెడ్డి ఎమ్మెల్యేలనే కలవలేదు. మనం కార్యకర్తలను కలుస్తున్నాం. నియోజకవర్గ పర్యటనల్లో ముందుగా కార్యకర్తలతో సమావేశం అవుతున్నాం. వారానికోరోజు పార్టీ కార్యాలయానికి వచ్చి సమస్యలు తెలుసుకుంటున్నాం. పార్టీ కోసం ప్రాణాలర్పించిన తోట చంద్రయ్య కుమారుడికి ప్రభుత్వ ఉద్యోగం కోసం చట్ట సవరణ చేశాం. మీరందరూ క్షేత్రస్థాయిలో ఉండి పార్టీ పిలుపునిచ్చిన కార్యక్రమాలను, సిద్ధాంతాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని మంత్రి పిలుపునిచ్చారు. అనంతరం అందరినీ మంత్రి నారా లోకేష్ ఘనంగా సత్కరించి ఎన్టీఆర్ జ్ఞాపికను బహూకరించారు. పార్టీ కార్యాలయంలో మంత్రి లోకేష్ తో ఆత్మీయ భేటీ పట్ల 'మై టీడీపీ యాప్' ఉత్తమ కార్యకర్తలు ధన్యవాదాలు తెలిపారు. తాము జీవితాంతం మర్చిపోలేమని ఆనందం వ్యక్తం చేశారు.

# మహిళలు భద్రతకు అధిక ప్రాధాన్యత కల్పించాలి - జిల్లా ఎస్పీ ఎ.ఆర్.దామోదర్




**విజయనగరం,కలంకౌంటర్ :** మహిళల భద్రతకు ప్రాధాన్యత కల్పించాలని, వారు ఇచ్చే ఫిర్యాదులపై తక్షణమే స్పందించి, వారి రక్షణకు భద్రత చర్యలు చేపట్టాలని అధికారులను జిల్లా ఎస్పీ ఎ.ఆర్.దామోదర్ ఆదేశించారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ ఎ.ఆర్.దామోదర్,ఐపిఎస్ మాట్లాడుతూ -- మహిళలు, పిల్లల భద్రతకు అధిక ప్రాధాన్యత కల్పించాలని, వారు ఇచ్చే ఫిర్యాదులపై తక్షణమే స్పందించి, భద్రత చర్యలు చేపట్టాలన్నారు. మహిళలపై జరుగుతున్న దాడులను నియంత్రించుటలో భాగంగా పోలీసు స్టేషన్లను ఆశ్రయించే మహిళలు, వారు చేసే ఫిర్యాదులపై తక్షణమే చర్యలు చేపట్టాలన్నారు. పోలీసు స్టేషన్లకు వచ్చే మహిళలతో పోలీసు సిబ్బంది మర్యాదగా మాట్లాడాలని, వారు చెప్పే విషయాలను శ్రద్ధగా వినాలని, వారు ఇచ్చే ఫిర్యాదులపట్ల సానుకూలంగా స్పందించి, చట్ట పరిధిలో వెంటనే చర్యలు చేపట్టాలన్నారు. అంతేకాకుండా, విధిగా కళాశాలలు, పాఠశాలలను, మహిళలు ఎక్కువగా ఉండే ప్రాంతాలను మహిళా పోలీసు సిబ్బంది, శక్తి బృందాలు సందర్శించి, వారికి రక్షణగా నిలిచే చట్టాలు పట్ల, శక్తి యాప్ పట్ల, సైబర్ మోసాలు పట్ల అవగాహన కల్పించాలన్నారు. ఆపద సమయంలో పోలీసులు సహాయం పొందే విధానంపట్ల అవగాహన కల్పించేందుకు జిల్లా పోలీసుశాఖ తరుపున చర్యలు చేపడుతున్నామన్నారు. ఇందులో భాగంగా జిల్లా వ్యాప్తంగా పోలీసు అధికారులు, మహిళా పోలీసులు (ఎం.ఎస్.పి.లు), ఇతర పోలీసు సిబ్బంది ప్రత్యేక డ్రైవ్ చేపట్టి తమ పోలీసు స్టేషను పరిధి లోని ముఖ్య కూడళ్లు, ఉన్నత పాఠశాలలు, కళాశాలలను, బస్టాండులు మరియు రైల్వే స్టేషన్ లను సందర్శించి ప్రజలు, మహిళలు, విద్యార్థినులతో మమేకమై, వారికి అర్థమయ్యే రీతిలో మహిళల రక్షణకు బాసటగా నిలిచే చట్టాలు, శక్తి యాప్ పట్ల, సైబర్ మోసాలు పట్ల అవగాహన కల్పించాలని అధికారులను జిల్లా ఎస్పీ ఎ.ఆర్.దామోదర్ ఆదేశించారు.

# జెట్టీ నిర్మాణంతో మత్స్యకారుల జీవితాల్లో వెలుగులు - ఎమ్మెల్యే

●జెట్టీపై ఎన్నికలకు ముందు మాట ఇచ్చా - ఇప్పుడు నిలబెట్టుకుంటున్నా ● 28 కోట్లతో జెట్టి నిర్మాణం



**కందుకూరు,కలంకౌంటర్ :** రామాయపట్నం పోర్టు భూనిర్వాసితులకు సంబంధించి... ఆర్ అండ్ ఆర్ ప్యాకేజీలో భాగంగా, గుడ్లూరు మండలం సాలిపేట పంచాయతీ మూర్తింపేట గ్రామం వద్ద 4.69 ఎకరాల్లో 28 కోట్ల అంచనాతో ఏర్పాటుకానున్న జెట్టి నిర్మాణానికి కందుకూరు శాసనసభ్యులు ఇంటూరి నాగేశ్వరరావు బుధవారం శంకుస్థాపన చేశారు. ప్రత్యేక పూజలు చేసిన అనంతరం, మొదటి ఇటుకను పేర్చి, జెట్టి పనులకు శ్రీకారం చుట్టారు. ఈ నిర్మాణంతో మత్స్యకారుల పడవల రాకపోకలకు సౌకర్యంగా ఉంటుంది. ఈ నిధులతో 328 అడుగుల పొడవు, 16 వెడల్పున జెట్టి నిర్మాణంతో పాటు... నిర్వహణ కోసం కార్యాలయాలు, మత్స్యకారుల సౌకర్యాలకు భవనాలు, చేపల ప్లాట్ ఫారం, ఇంకా అనేక మౌలిక వసతులు ఏర్పాటవుతాయి. వచ్చేఏడాది ఏప్రిల్ చివరికల్లా జెట్టి అందుబాటులోకి వస్తుందని అధికారులు తెలిపారు. ఎమ్మెల్యే నాగేశ్వరరావు మాట్లాడుతూ... గత ఎన్నికలకు ముందు జెట్టి నిర్మాణానికి హామీ ఇచ్చామని, శంకుస్థాపనతో మాట నిలబెట్టుకుంటున్నట్లు చెప్పారు. ఈ నిర్మాణం పూర్తయితే మత్స్యకారుల జీవితాల్లో వెలుగులు నిండుతాయన్నారు. భూ నిర్వాసితులకు న్యాయమైన నష్ట పరిహారం అందించడం జరిగిందన్నారు. వైసీపీ పాలనలో.. పునరావాస కాలనీలో వసతులను మధ్యలో వదిలేశారని ఎమ్మెల్యే నాగేశ్వరరావు గుర్తు చేశారు. కూటమి ప్రభుత్వంలో రెండు గ్రామాల్లో అసంపూర్తి పనులన్నీ పూర్తి చేసామన్నారు. కర్లపాలెం లేఅవుట్ విషయంలో కోర్టు కేసులు ఉన్నప్పటికీ, వారిని కలెక్టర్ వద్ద కూర్చోబెట్టి, మాట్లాడి ఒప్పించి ఆ సమస్యను కూడా పరిష్కరించినట్లు ఇంటూరి వెల్లడించారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు తో పాటు సంబంధిత మంత్రులు, మారి టైం బోర్డు అధికారులను అనేకసార్లు కలిసి మత్స్యకారులకు న్యాయం చేసామని చెప్పుకొచ్చారు. మత్స్యకారులు కోరిక మేరకు, మరొకసారి వారిని కలిసి, జెట్టి నిర్మాణాన్ని పొడిగించేందుకు కృషి చేస్తానన్నారు. వైసీపీ నేతలు ఇంకా విధ్వంసం వైపు ప్రయాణిస్తున్నారని, వారి తీరులో మార్పు కనపడడం లేదని ఎమ్మెల్యే నాగేశ్వరరావు విమర్శించారు. ఒకవైపు ప్రజా రాజధాని అమరావతి నిర్మాణం వేగంగా జరుగుతుంటే, మావిగన్ అంటూ జగన్ కొత్త పల్లవి పాడటం విడ్డూరంగా ఉందన్నారు. వాస్తవాలను విడమరిచి చెప్పిన ఏబీఎన్ ఆంధ్రజ్యోతి ఆఫీస్ పై వైసీపీ రౌడీలు దాడికి ప్రయత్నించడాన్ని ఎమ్మెల్యే తీవ్రంగా ఖండించారు. ఈ కార్యక్రమంలో పోర్ట్ డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ శివరాం, మండల తహసిల్దార్ బాలకిషోర్, మండల అభివృద్ధి అధికారి వెంకటేశ్వర్లు, గుడ్లూరు మండల టిడిపి అధ్యక్షులు జనిగర్ల నాగరాజు, సాలిపేట గ్రామ టిడిపి అధ్యక్షులు వేముల స్వామి, పార్టీ నాయకులు ఆవుల శీను, కర్లపాలెం మాజీ సర్పంచ్ చేపల రమణయ్య, అట్ల కోటయ్య, గొల్లప్రోలు హరిప్రసాద్, పొట్టేళ్ల మురళి, పోలుగంగు కృష్ణ, గద్దగుంట శ్రీను, అవనిగడ్డ కృష్ణ, యనమల రామారావు, కొండబాబు, సుధాకర్, పలువురు కాపునేతలు, కూటమి పార్టీల నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# గూడూరు మండలంలో కలెక్టర్ డీకే బాలాజీ పర్యటన



**పెడన,కలంకౌంటర్ :** వంతెన నిర్మాణాల్లో తప్పనిసరిగా నాణ్యత ప్రమాణాలు పాటించాలని జిల్లా కలెక్టర్ డీకే బాలాజీ అధికారులను ఆదేశించారు. బుధవారం సాయంత్రం జిల్లా కలెక్టర్ గూడూరు మండలంలోని పర్ణశాల ప్రధానమంత్రి సడక్ యోజన రహదారి మార్గంలో 3.38 కోట్ల రూపాయల వ్యయంతో పంచాయితీరాజ్ శాఖ నిర్మిస్తున్న 32 మీటర్ల వంతెనను పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ నిర్మాణంలో ఉన్న వంతెనకు రీబౌండ్ హేమర్ కాంక్రీట్ పరీక్షను నిర్వహించారు. నాణ్యత ప్రమాణాలను వంతెన పైభాగాన క్రింది భాగాన సంబంధిత పరికరంతో స్వయంగా పరిశీలించారు. అనంతరం జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ క్రింది భాగంలో నీటితో క్యూరింగ్ చేయడంతో బాగా దృఢంగా ఉందని, పైభాగాన ఇంకా నీటితో క్యూరింగ్ చేయవలసింది ఉందని సూచించారు. వంతెన నిర్మాణంలో ఎట్టి పరిస్థితుల్లోనూ రాజీ పడరాదని నాణ్యత ప్రమాణాలు విధిగా పాటించి నిర్మించాలన్నారు. తాను ఈ మార్గంలో వెళ్లే సమయంలో మరలా ఒకసారి నాణ్యతను పరిశీలిస్తామన్నారు. చివరి బిల్లు చెల్లింపు చేసే ముందు కూడా పరీక్షిస్తామని అధికారులకు స్పష్టం చేశారు. ఈ పర్యటనలో కలెక్టర్ వెంట పంచాయతీరాజ్ ఎస్ ఈ రమణ రావు గూడూరు మండల తహసిల్దారు రాజ్యలక్ష్మి, ఎంపీడీవో శైలజ కుమారి పంచాయతీరాజ్ శాఖ డి ఈ ఈ నాగరాజు ఏఈ గోపి తదితర అధికారులు అనధికారులు పాల్గొన్నారు.

# ముఖ్యమంత్రితో ప్రపంచ బ్యాంక్ బృందం భేటీ

- అమరావతిలో భారీగా పెట్టుబడులకు అవకాశముందన్న ప్రపంచ బ్యాంక్ ప్రతినిధులు
- రాష్ట్రానికి అమరావతి గ్రోత్ ఇంజన్ గా మారుతుందని అభిప్రాయపడ్డ వరల్డ్ బ్యాంక్ ప్రతినిధులు
- అమరావతి సహా రాష్ట్ర సమగ్రాభివృద్ధికి ప్రణాళికలు రూపొందిస్తున్నామని సీఎం వెల్లడి




**అమరావతి,కలంకౌంటర్ :** ప్రపంచ బ్యాంకు ప్రతినిధి బృందం ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుతో బుధవారం రాష్ట్ర సచివాలయంలో సమావేశమైంది. అమరావతి నిర్మాణ ప్రగతిని ప్రతినిధి బృందం ప్రశంసించింది. అమరావతిలో ఏర్పాటు చేస్తున్న మౌలిక సదుపాయాలు, ఐటీ-విద్యుత్ రంగ సంస్కరణల వల్ల ఈ నగరం భారీగా అంతర్జాతీయ పెట్టుబడులను ఆకర్షిస్తుందని ప్రపంచ బ్యాంకు బృందం అభిప్రాయపడింది. రాష్ట్రానికి అమరావతి గ్రోత్ ఇంజిన్ గా మారుతుందని వెల్లడించింది. మౌలిక సదుపాయాల అభివృద్ధితో వాణిజ్య కార్యాకలాపాలకు అమరావతి కేంద్రంగా మారుతుందని ఆశిస్తున్నట్టు బృంద ప్రతినిధులు ముఖ్యమంత్రితో చెప్పారు. ప్రపంచ స్థాయి రాజధాని నిర్మాణం చేపట్టడంతోపాటు.. రాష్ట్రంలోని అన్ని ప్రాంతాల సమగ్రాభివృద్ధి దిశగా తాము పని చేస్తున్నట్టు ముఖ్యమంత్రి ప్రపంచ బ్యాంక్ బృందానికి సీఎం చంద్రబాబు వివరించారు. మూడు రీజియన్లుగా రాష్ట్రాన్ని అభివృద్ధి చేసేలా ప్రణాళికలు రూపొందించినట్టు ముఖ్యమంత్రి చెప్పారు.

# జిల్లా ముఖ్య కేంద్రం లో ప్రతిరోజు మంచినీళ్లు అందించండి....

## -లంకిశెట్టి బాలాజీ డిమాండ్..



**మచిలీపట్నం,కలంకౌంటర్ :** కృష్ణాజిల్లా ముఖ్య కేంద్రం మచిలీపట్నంలో ప్రతిరోజు నగర ప్రజలకు మంచినీళ్లు అందే విధంగా చర్యలు తీసుకోవాలని నగరపాలక ప్రత్యేక అధికారి కృష్ణాజిల్లా కలెక్టర్ డీ.కే బాలాజీని మచిలీపట్నం బార్ అసోసియేషన్ మాజీ అధ్యక్షులు లంకిశెట్టి బాలాజీ డిమాండ్ చేశారు. బుధవారం మచిలీపట్నంలో జరిగిన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ ప్రభుత్వాలు మారినా గత 15 సంవత్సరాలుగా మచిలీపట్నంలో రోజు విడిచి రోజు కేవలం 30 నిమిషాలు మాత్రమే మంచినీళ్లు సరఫరా చేసి నగర ప్రజలను తీవ్ర ఇబ్బందులకు గురి చేస్తున్నారని బాలాజీ అన్నారు. నగరపాలక సంస్థ పత్తి నెల మంచినీటి కుళాయికి 30 రోజులకి వంద రూపాయలు పన్ను వసూలు చేసి కేవలం 15 రోజులు మాత్రమే మంచినీటిని సరఫరా చేయటం ఎంతవరకు సమంజసం అని బాలాజీ ప్రశ్నించారు. ఎప్పుడో అప్పటి శాసనసభ్యులు పేర్ని కృష్ణమూర్తి హయం లో నిర్మించిన తారకటూరు మంచినీటి చెరువు తర్వాత అనేకమంది శాసనసభ్యులు పార్లమెంట్ సభ్యులు మారిన పెరుగుతున్న జనాభా కి అనుగుణం గా మచిలీపట్నానికి అదనపు వాటర్ ట్యాంక్ సరఫరా కోసం కొత్త ట్యాంకులు తవ్వడంలో వైఫల్యం చెందారని బాలాజీ అన్నారు. తరటూరు ట్యాంకునుండి పెడన మరియు బందరు గ్రామీణ ప్రాంతాలకు కూడా మంచినీరు సరఫరా కావడం వలన తరగటూరు సమ్మర్ స్టోరేజ్ ట్యాంక్ మచిలీపట్నం ప్రజలకు సరిపోవటం లేదని బాలాజీ అన్నారు. నగర ప్రజలకు కావలసిన మంచినీళ్లు అందించడంలో అధికారులు వైఫల్యం చెందితే ఆటో అధికార పార్టీలు గాని ప్రతిపక్ష పార్టీలు గాని పట్టలేదని బాలాజీ అన్నారు. పనికిరాని విషయాల కోసం పది ప్రశ్నలు పెట్టడం కన్నా పనికివచ్చే మంచినీటి కోసం ఒక ప్రెస్ మీట్ ఎందుకు పెట్టారని బాలాజీ ప్రశ్నించారు. నీతి నిజాయితీతో పని చేసే జిల్లా కలెక్టర్ డీకే బాలాజీ మచిలీపట్నం ప్రజల యొక్క తక్షణ అవసరమైన మంచినీటి సమస్యను పరిష్కరించాలని బాలాజీ కోరారు. నీతి నిజాయితీతో పార్లమెంట్ ప్రజల కోసం పనిచేస్తున్న మచిలీపట్నం పార్లమెంట్ సభ్యులు వల్లభనేని బాలశౌరి కేంద్ర ప్రభుత్వం నుండి ప్రత్యేక నిధులను తీసుకువచ్చి మచిలీపట్నం ప్రజలకు శాశ్వతంగా మంచినీటి సమస్య పరిష్కారానికి కృషి చేయాలని బాలాజీ సూచించారు అదేవిధంగా ప్రభుత్వ నిధులతో బైపాస్ రోడ్ లోని హిందూ స్మశాన వాటికను బందరు కోటలోని క్రిస్టియన్ల స్మశాన వాటికను బుట్టయ్యపేటలోని మలకా పట్నంలోని ముస్లింల వర్షాలు వాటికను అభివృద్ధి పరచాలని లంకిశెట్టి బాలాజీ కోరారు

# బ్రాహ్మణ యువత పారిశ్రామికవేత్తలుగా ఎదిగేందుకు రుణాలు ఇప్పించండి

## -రాష్ట్ర మంత్రి కి బ్రాహ్మణ వెల్ఫేర్ కార్పొరేషన్ డైరెక్టర్ పి. వి. ఫణి కుమార్ విజ్ఞప్తి




**మచిలీపట్నం,కలంకౌంటర్ :** నాగార్జున యూనివర్సిటీలోని డాక్టర్ హెచ్. హెచ్. డై క్ మ న్ ఆడిటోరియంలో నిర్వహించిన ఎం ఎస్ ఎం ఈ పార్కుల్లో ఈ డబ్ల్యూ ఎస్ వర్గీయులకు జరిగిన అవగాహన సదస్సులో బ్రాహ్మణ వెల్ఫేర్ కార్పొరేషన్ చైర్మన్, కె. బుచ్చి రాంప్రసాద్ తో పాటుగా బ్రాహ్మణ వెల్ఫేర్ కార్పొరేషన్ డైరెక్టర్, పి. వి. ఫణి కుమార్ పాల్గొని మంత్రి ఎస్. సవితను వేద ఆశీర్వచనముతో ఆశీర్వదించి, బ్రాహ్మణుల సమస్యలను మంత్రి ఎస్. సవితకు బ్రాహ్మణ వెల్ఫేర్ కార్పొరేషన్ డైరెక్టర్, పి. వి. ఫణి కుమార్ తెలియజేసి నట్లు పత్రికా ప్రకటన ద్వారా మాట్లాడుతూ బ్రాహ్మణ నిరుద్యోగ యువత పారిశ్రామికవేత్తలుగా ఎదిగేందుకు బ్యాంకుల ద్వారా రుణాలు ఇప్పించాలని మంత్రి ఎస్. సవితను కోరినట్లు తెలిపారు. ప్రతి ఇంటి నుంచి ఒకరిని పారిశ్రామికవేత్తగా తీర్చిదిద్దాలన్న ముఖ్యమంత్రి చంద్రబాబు లక్ష్యాన్ని ఈ డబ్ల్యూ ఎస్ కార్పొరేషన్ అధికారులు ప్రతి జిల్లాలోనూ బలంగా ప్రజల్లోకి తీసుకు వెళ్లే విధంగా చర్యలు చేపట్టాలి అని మంత్రిని కోరాము అన్నారు. గత టిడిపి ప్రభుత్వంలో చనిపోయిన నిరుపేద బ్రాహ్మణులకు మట్టి ఖర్చులు ఇచ్చేవారని, ఇప్పుడు కూడా చంద్రబాబు నాయుడు నాయకత్వంలోని కూటమి ప్రభుత్వం ద్వారా బ్రాహ్మణ కార్పొరేషన్ ఆ పథకాన్ని అమలు చేసేలా చర్యలు తీసుకోవాలని మంత్రి ఎస్. సవితను కోరినట్లు పి. వి.ఫణి కుమార్ తెలిపారు.

# సాగునీటిని వనరులను సంరక్షించుకుందాం

- అప్పుడే...ప్రతి ఎకరాకు నీరు అందించగలం
- అధికారులు, సాగునీటి సంఘాల చైర్మన్లకు ఎమ్మెల్యే ఇంటూరి సూచన
- జలధార కార్యక్రమంలో భాగంగా... కొండికందుకూరు చెరువు సందర్శన
- 2.5 కోట్లతో రాళ్లపాడు రిజర్వాయర్, 10 కోట్లతో చెరువులు అభివృద్ధి చేస్తున్నామని వెల్లడించిన ఎమ్మెల్యే



**కందుకూరు,కలంకౌంటర్ :** రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన జలధార - జలహారతి - సాగునీటి సంఘాల బాధ్యత కార్యక్రమంలో భాగంగా.... నియోజకవర్గంలోని 45 సాగునీటి సంఘాల చైర్మన్లు, కమిటీ సభ్యులు, రైతు నాయకులు, అధికారులతో కందుకూరు శాసనసభ్యులు ఇంటూరి నాగేశ్వరరావు బుధవారం పలు కార్యక్రమాలు నిర్వహించారు. ముందుగా కందుకూరులోని నీటిపారుదల శాఖ కార్యాలయంలో... వారందరితో సమావేశం నిర్వహించారు. చెరువులు, ఇతర నీటి వనరులకు సంబంధించి.... కూటమి ప్రభుత్వంలో చేపట్టిన అభివృద్ధి పనులు, విడుదలైన నిధులు, పనుల వివరాలు, పెండింగ్ పనుల గురించి సుదీర్ఘంగా చర్చించారు. వాన నీరు, ఇతర వనరుల ద్వారా వచ్చే నీటిని సంరక్షించుకోవాల్సిన బాధ్యత అందరిపై ఉందని ఎమ్మెల్యే నాగేశ్వరరావు అన్నారు. ప్రతి ఎకరాకు నీరు అందించడమే ధ్యేయంగా అధికారులు, సాగునీటి సంఘాల చైర్మన్లు పనిచేయాల్సిన అవసరం ఉందన్నారు. సాగునీటికి సంబంధించిన సమస్యలను తన దృష్టికి తీసుకువస్తే పరిష్కరిస్తానని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు.కార్యక్రమంలో భాగంగా, కందుకూరు మండలం కొండికందుకూరు చెరువును రైతులతో కలిసి ఎమ్మెల్యే నాగేశ్వరరావు సందర్శించారు. అక్కడ పూజలు చేసి, జలహారతి ఇచ్చారు. కొండికందుకూరు చెరువు అభివృద్ధి, ఆయకట్టు, కాలువలు, తూముల గురించి రైతులతో మాట్లాడారు. అలాగే గ్రామస్తులు ఎదుర్కొంటున్న పలు సమస్యలు, వాటి పరిష్కారాలపై చర్చించారు. నియోజకవర్గ ప్రజల జీవనాడి అయిన రాళ్లపాడు రిజర్వాయర్ అభివృద్ధికి ఇప్పటికే 2.5 కోట్లు ఖర్చు చేసినట్లు ఎమ్మెల్యే నాగేశ్వరరావు వెల్లడించారు. అలాగే పలు చెరువుల రిపేర్లు, అభివృద్ధి పనుల కోసం పది కోట్లు మంజూరయ్యాయని, పనులు వేగంగా జరుగుతున్నాయని ఆయన తెలిపారు. రైతుల విషయంలో అధికారులు కూడా బాధ్యతగా విధులు నిర్వర్తించాలని సూచించారు. ఈ కార్యక్రమాల్లో ఇరిగేషన్ డిఈ హాజరతయ్య, రాళ్లపాడు ప్రాజెక్ట్ డిఇ లు వెంకటేశ్వర్లు, శేషయ్య, రాళ్లపాడు రిజర్వాయర్ ఆయకట్టు చైర్మన్ ఏలూరు వెంకటేశ్వర్లు, వి ఆర్ కోట సప్లై ఛానల్ చైర్మన్ తల్లపనేని రవీంద్ర, కందుకూరు పట్టణ టిడిపి అధ్యక్షులు దామా మల్లేశ్వరరావు, కందుకూరు మండల టిడిపి అధ్యక్షులు బుస్సారెడ్డి కృష్ణారెడ్డి, గుడ్లూరు మండల టిడిపి అధ్యక్షులు జనిగర్ల నాగరాజు, వలేటివారిపాలెం మండల టిడిపి అధ్యక్షులు మాదాల లక్ష్మీనరసింహం, కందుకూరు మండలం మాజీ టిడిపి అధ్యక్షులు నార్నే రోశయ్య, నియోజకవర్గం లోని చెరువు ఆయకట్టు చైర్మన్లు, రైతులు భారీ సంఖ్యలో హాజరయ్యారు.

# సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించుకుని నిఘా ఏర్పాటు - జిల్లా ఎస్పీ బి.ఉమామహేశ్వర్




**బాపట్ల,కలంకౌంటర్ :** బందోబస్తు విధులు నిర్వహించడానికి విచ్చేసిన పోలీస్ అధికారులు, సిబ్బంది సమయపాలన పాటిస్తూ నిర్దేశించిన ప్రదేశాల్లో సమర్థవంతంగా విధులు నిర్వహించాలని జిల్లా ఎస్పీ బి.ఉమామహేశ్వర్ తెలిపారు., గురువారం పట్టాదార్ పాస్ పుస్తకాల పంపిణీ కార్యక్రమానికి బాపట్ల జిల్లా వేమూరు నియోజకవర్గంలోని భట్టిప్రోలు మండలం సురేపల్లి గ్రామానికి రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు రానున్నారు. ఈ నేపథ్యంలో బందోబస్తు విధులు నిర్వహించనున్న పోలీస్ అధికారులు, సిబ్బందికి బుధవారం భట్టిప్రోలు మార్కెట్ యార్డ్‌లో జిల్లా ఎస్పీ బ్రీఫింగ్ నిర్వహించారు. మ్యాప్‌ను చూపిస్తూ సెక్టార్ల వారీగా వారు నిర్వహించవలసిన విధుల గురించి వివరించారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ మాట్లాడుతూ హెలిప్యాడ్, ప్రజా వేదిక, ఫీల్డ్ విజిట్, క్యాడర్ మీటింగ్ ప్రదేశాలు, కాన్వాయ్ ప్రయాణించే మార్గం, రూఫ్‌టాప్‌లు, పార్కింగ్ ప్రాంతాలు, ట్రాఫిక్ డైవర్షన్ పాయింట్లలో విధులు నిర్వహించే వారు అప్రమత్తంగా తమ విధులను నిర్వహించాలన్నారు. బీడీ టీమ్‌లు ప్రతి ఒక్కరినీ క్షుణ్ణంగా తనిఖీ చేసి అనుమతించాలన్నారు. ట్రాఫిక్, పార్కింగ్ విషయంలో ప్రత్యేక దృష్టి సారించాలని అధికారులను



ఆదేశించారు. సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించుకుని డ్రోన్లు, సీసీ కెమెరాల ద్వారా ప్రజా వేదిక, హెలిప్యాడ్, కాన్వాయ్ ప్రయాణించే మార్గం మరియు ఇతర కీలక ప్రదేశాల్లో నిఘా ఏర్పాటు చేశామన్నారు. వాటి ద్వారా కమాండ్ కంట్రోల్ రూమ్ నుండి ఎప్పటికప్పుడు పరిస్థితులను గమనిస్తూ తగిన సూచనలు ఇవ్వడం జరుగుతుందన్నారు. అందరూ సమయపాలన పాటిస్తూ, డ్యూటీ పాస్పోర్ట్ లో ఎవరికి నిర్ణయించిన ప్రదేశాల్లో వారు పూర్తి సామర్థ్యంతో విధులు నిర్వహించాలని సూచించారు. విధుల విషయంలో పూర్తి స్పష్టతతో బందోబస్తు నిర్వహించాలన్నారు. ఏదైనా సమస్య తలెత్తిన వెంటనే సంబంధిత అధికారులకు తెలియజేయాలని తెలిపారు. విధి నిర్వహణలో ఎవరైనా అలసత్వం ప్రదర్శించినా, గైర్హాజరు అయినా శాఖాపరమైన చర్యలు తీసుకుంటామని జిల్లా ఎస్పీ హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ ఎస్పీ సత్య బాబు, రేపల్లె, బాపట్ల, చీరాల డిఎస్పీలు ఏ.శ్రీనివాసరావు, పి.జగదీష్ నాయక్, ఎండి.మోయిన్, ఇతర పోలీస్ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

# అంతర్జాతీయ క్రియేటివ్ ఎకానమీ హబ్‌గా అమరావతిని తీర్చిదిద్దుతాం: మంత్రి కందుల దుర్గేష్

- ముంబయిలో జరుగుతున్న 21వ హోటల్ ఇన్వెస్ట్ మెంట్ కాన్ఫరెన్స్ సౌత్ ఏషియా లో ఈరోస్, రెడ్ బుల్ సంస్థలతో వ్యూహాత్మక ఒప్పందాలు..పెట్టుబడుల ఆకర్షణే ధ్యేయంగా అంతర్జాతీయ దిగ్గజ సంస్థలతో మంత్రి దుర్గేష్ కీలక చర్చలు
- ముంబయి వేదికగా ఏపీ పర్యాటక ప్రగతిని చాటిచెప్పిన మంత్రి దుర్గేష్..అమరావతి కేవలం నగరం కాదు.. ఇదొక అంతర్జాతీయ క్రియేటివ్ హబ్ గా ప్రకటన
- అమరావతి, విశాఖ, తిరుపతి ప్రాంతాల అనుసంధానం చేస్తూ స్టోరీటెల్లింగ్ కారిడార్ కు చర్యలు
- హోలోగ్రాఫిక్ స్టోరీటెల్లింగ్ టెక్నాలజీతో ఏపీ సాంస్కృతిక వైభవం..సంప్రదాయ సందర్శన నుండి 'ఎక్స్‌పీరియన్స్ ఎకానమీ' వైపు ఏపీ పర్యాటకం అడుగులు
- పర్యాటకులకు సరికొత్త అనుభూతిని పంచనున్న డిజిటల్ మౌలిక వసతులు..స్పోర్ట్స్ టూరిజం వైపు ఆంధ్రప్రదేశ్ అడుగులు
- పర్యాటక రంగం ద్వారా దీర్ఘకాలిక ఆర్థిక వృద్ధికి బాటలు వేస్తున్నామన్న మంత్రి కందుల దుర్గేష్..ఉపాధి కల్పనతో పాటు రాష్ట్రానికి అంతర్జాతీయ గుర్తింపు తెస్తామని వెల్లడి




**ముంబయి/అమరావతి,కలంకౌంటర్ :** ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాన్ని ప్రపంచ స్థాయి పర్యాటక మరియు సృజనాత్మక ఆర్థిక కేంద్రంగా(క్రియేటివ్ ఎకానమీ హబ్) తీర్చిద్దడమే కూటమి ప్రభుత్వ లక్ష్యమని రాష్ట్ర పర్యాటక, సాంస్కృతిక, సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి కందుల దుర్గేష్ వెల్లడించారు. ముంబయిలోని గ్రాండ్ హయత్ హోటల్ లో 8-9 తేదీల్లో జరుగుతోన్న 21వ హోటల్ ఇన్వెస్ట్ మెంట్ కాన్ఫరెన్స్ సౌత్ ఏషియా(HICSA) కు మంత్రి దుర్గేష్ హాజరయ్యారు. ఈ సందర్భంగా ఏపీ పర్యాటక రంగంలో తీసుకురాబోతున్న విప్లవాత్మక మార్పులను ఆయన వివరించారు. మంత్రి దుర్గేష్ నేతృత్వంలో ఆంధ్రప్రదేశ్ ప్రతినిధి బృందం కంటెంట్, సంస్కృతి, జీవనశైలి మరియు ఇమ్మర్సివ్ డిజైన్‌ను పర్యాటక ప్రాంతాల అభివృద్ధిలో విలీనం చేయడంపై సృజనాత్మక మరియు అనుభవ ఆర్థిక వ్యవస్థకు చెందిన పలువురు వాటాదారులు అయిన జేఎస్ డబ్ల్యూ స్పోర్ట్స్, ఆర్ ఎంజెడ్, అర్వాస్, తమరా లీజర్ ఎక్స్‌పీరియన్సెస్, షాలెట్ హోటల్స్ మరియు హవాస్ మీడియా సంస్థల ప్రతినిధులతో కీలక చర్చలు జరిపింది. పర్యాటక రంగాన్ని ఏపీ పర్యాటక రంగంలో పెట్టుబడులను ఆకర్షించడమే కాకుండా, క్రియేటివ్ ఎకానమీ హబ్ గా మార్చడమే తమ ప్రాధాన్యత అని మంత్రి దుర్గేష్ వారికి వివరించారు. ఈ సందర్భంగా మంత్రి కందుల దుర్గేష్ మాట్లాడుతూ అమరావతిని కేవలం ఒక నగరంగానే కాకుండా అంతర్జాతీయ స్థాయి 'క్రియేటివ్ ఎకానమీ హబ్'గా తీర్చిదిద్దేందుకు వ్యూహాత్మక అడుగులు వేస్తున్నామన్నారు. కేవలం సందర్శనకే పరిమితం కాకుండా సందర్శకులకు సరికొత్త అనుభూతిని పంచే 'ఎక్స్ పీరియన్స్ ఎకానమీ' వైపు ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం అడుగులు వేస్తోందని పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఈరోస్ ఇంటర్నేషనల్, రెడ్ బుల్ వంటి దిగ్గజ సంస్థలతో కలిసి పని చేయడం ద్వారా రాష్ట్రంలోని అమరావతి, విశాఖపట్నం, తిరుపతి ప్రాంతాలను కలుపుతూ ఒక భారీ 'స్టోరీటెల్లింగ్ కారిడార్'ను అభివృద్ధి చేస్తామని మంత్రి దుర్గేష్ ప్రకటించారు. ఏపీ ఆధ్యాత్మికతను, సంస్కృతిని డిజిటల్ మాధ్యమాల్లో అంతర్జాతీయ పర్యాటకులకు పరిచయం చేయడానికి, భవిష్యత్ తరాలకు అందించేందుకు హోలోగ్రాఫిక్ స్టోరీటెల్లింగ్ మరియు ఇమ్మర్సివ్ కల్చరల్ నెరేటివ్స్ వంటి అధునాతన సాంకేతికతలను ఉపయోగిస్తామని మంత్రి దుర్గేష్ వెల్లడించారు.

# స్వచ్ఛ సర్వేక్షణ్ కు సమష్టిగా ముందుకు..

- క్షేత్రస్థాయి సిబ్బంది కీలక పాత్ర పోషించాలి
- సమష్టిగా పనిచేసి ర్యాంకుల సాధనకు కృషిచేయాలి
- జిల్లా కలెక్టర్ డా. జి.లక్ష్మీశ





**విజయవాడ,కలంకౌంటర్ :** ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్, విజయవాడ నగర పాలక సంస్థ స్పెషల్ ఆఫీసర్ డా. జి.లక్ష్మీశ, కమిషనర్ ధ్యానచంద్ర ఆధ్వర్యంలో బుధవారం సాయంత్రం తుమ్మలపల్లి కళాక్షేత్రంలో వివిధ శాఖధిపతులు, స్వర్ణ వార్డు సిబ్బందితో స్వచ్ఛ సర్వేక్షన్, సమ్మర్ యాక్షన్ ప్లాన్, సెన్సెస్ పై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్, స్పెషల్ ఆఫీసర్ డాక్టర్ జి.లక్ష్మీశ మాట్లాడుతూ స్వచ్ఛ సర్వేక్షన్ లో సూపర్ స్వచ్ఛ లీగ్ అవార్డు నిలబెట్టుకోవడంలో క్షేత్రస్థాయిలో సిబ్బందిది ప్రధాన పాత్రని అన్నారు. ప్రతి ఒక్కరూ ఈ వేసవికి సమ్మర్ యాక్షన్ ప్లాన్ భాగంలో త్రాగునీటి సరఫరా లో ప్రజలకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా చూసుకోవాలని, జనగణనలో భాగంగా ప్రతి ఒక్కరూ చురుగ్గా పాల్గొని దేశాభివృద్ధిలో తోడ్పడాలని అన్నారు. ఈ కార్యక్రమంలో అదనపు కమిషనర్లు డాక్టర్ డి.చంద్రశేఖర్, ఏ. రవీంద్రరావు, చీఫ్ మెడికల్ హెల్త్ ఆఫీసర్ డాక్టర్ కె. అర్జునరావు, చీఫ్ సిటీ ప్లానర్ కె. సంజయ్ రత్నకుమార్, చీఫ్ ఇంజనీర్ ఇన్చార్జ్ సత్యకుమారి, డిప్యూటీ కమిషనర్ (రెవెన్యూ) జి. సృజన, జోనల్ కమిషనర్లు రమ్య కీర్తన, కె.ప్రభుదాస్, కె. షమ్మీ, ఎస్టేట్ ఆఫీసర్ ఏ శ్రీధర్, అధికారులు సిబ్బంది పాల్గొన్నారు.

Printed,Published and owned by Chitta Vasavidevi Printed at Rama Offset Printers, 7th ward, Ponnuru, Guntur District-522 124 Andhra Pradesh and Published at 7th ward, Ayyappa Nagar, Ponnuru-522 124, Guntur District. Andhra Pradesh. Editor : Chitta Vasavidevi. RNI No.APTEL/2016/69464, Phone No.9346935672, kalamcounter@gmail.com